

కథా కౌముది

# బంధుప్రీతి
## దుద్దుంపూడి అనసూయ



పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
కౌముది నిర్వహించిన కథల పోటీ (2023)లో
బహుమతి పొందిన కథ

"నేను రానన్నా వినకుండా మళ్లీ మీ సరస్వతి చెల్లి ఇంటికి తీసుకెళుతున్నారు" ఆవిడను తట్టుకుని నిలబడాలంటే నాకు ఓపిక లేదు సుమీ. పైగా మర్యాదులు చేస్తుంది మహా తల్లి. ఆవిడ మర్యాద మండిపోనూ" వంటి మీద గుడ్డలు చింపేయటం ఏమిటండీ"చిత్రాలు కాకపోతేనూ. ఈసారేం ఘన కార్యం చేస్తుందోననే కదా, ఖర్మ కాకపోతే ఇలా ఫంక్షన్ కి నాసి రకం గుడ్డలేసుకు వెళ్లటం. అవ్వ..! వచ్చిన వాళ్లంతా మనల్ని చూసి ఏమనుకుంటారో." అంది అనసూయ.

" పోనీలేవే. ఎప్పుడో జరిగిన సంగతి ఇప్పుడెందుకు. తన గురించి తెలిసిందే కదా. దానికి నా అన్న వాళ్లంటే ఆపేక్ష, ప్రేమ ఎక్కువ. బంధు ప్రీతి జాస్తి. పాపం అమాయకురాలు, ఉబలాటం ఎక్కువ.మనల్ని చూస్తే దాని మొఖం చాటంతవుతుంది" ఒకే విషయం మార్చి మార్చి చెబుతూ చెల్లెలిపై తన ప్రేమను చాటుకున్నాడు శంకరరావు.

"ప్రేమా, దోమా. పెదాల మీద పప్పులొండేస్తుంది, అమాంతం వాటేసుకుని ఊపిరాడనీయకుండా ఉడుంపట్టు పట్టేస్తుంది, చేతులు పట్టుకుని చపాతీ పిండి పిసికి నట్టు నలిపి పడేస్తుంది. భుజాలు పచ్చి పుండయిపోతుంటే విడిపించు కుని దూరం జరిగే సరికి తల ప్రాణం తోకకు వస్తుందంటే. నమ్మండి."

అనసూయ గత అనుభవాలు గుర్తు చేసుకుంటూ అంది.

"అది కాదే దానికి మన మీద ఎంత ఇది లేకపోతే ఆపసోపాలు పడుతూనే పొయ్యి దగ్గర కూర్చుని మనకిష్టమైన వంటకాలన్ని ఒంటి చేత్తో స్వయంగా వండి పెడుతుంది చెప్పు. మన బంధువుల్లో అంత అబ్బరంగా చూసే వాళ్లెవరున్నారు చెప్పు. కష్టమో. నష్టమో దాని ప్రేమకు నేను బందినైపోతాను. కొసరి కొసరి వడ్డిస్తుంది చూడు అలా మా సరస్వతికే చెల్లుతుంది" అన్నాడు శంకర రావు.

"ఆ... బడాయి కాకపోతే ఆ బ్రతిమాలటమేంటండి. కావలిస్తే తింటాముగా. నోట్లో కుక్కినంత పని చేస్తుంది. అయినా కక్కొచ్చేస్తుంది, తినలేము బాబోయ్ అని మొత్తుకుంటున్నా వినిపించుకోదేం. ' ఇంకొంచం వేసుకో''ఇంకొంచం తిను' అంటూ వెంట పడుతుంది. ఏం మనిషో ఏమిటో. ఇంటికి వెళ్లటం మానేసినా, ఏదైనా ఫంక్షన్ లో కలిసినా అంతే. ఓసారి నాకేమో అర్జెంటయి వాష్ రూమ్ కాళీ లేదని ఇబ్బంది పడుతుంటే కూల్ డ్రింక్ తాగమంటూ గ్లాసు పట్టుకుని వెంట వస్తూ నరకం చూపెట్టింది. అర్ధం చేసుకోదే. రసం సాంబారుల్లా ప్రేమ టన్నులు టన్నులు కార్చేస్తున్నానుకుంటుందే తప్ప ఎదుటి వాళ్ల ఇబ్బంది పట్టించుకోదు. తనని తట్టుకోవటం నా వల్ల కావటం లేదు బాబూ. మీరేమో. 'మనవరాలి ఫస్ట్ బర్తడేకి పిలిచింది మనం వెళ్లక పోతే బాధ పడి పోతుంది.' అంటూ తీసుకెళుతున్నారు" ఆడ పడుచు మీద ఉన్న చిన్న చూపు, చిరాకునంతా వెటకారంగా వెళ్లగక్కింది అనసూయ.

"సరేలే. అక్కడికి వెళ్లాక కూడా అలా మాడు మొఖంతో ఉండక కాస్త మొఖానికి నవ్వు పులుముకో. మా సరస్వతి చూడు ఎప్పుడు నవ్వుతూనే ఉంటుంది. నాకు తెలుసులే నీకెంత ఇష్టం లేక పోయినా దాని ఎదురుగా ఏ మాటా అని దాన్ని బాధ పెట్టవని, మూడేళ్లయ్యిందిగా ఈ సారి తాకిడి ఇంకాస్త గట్టిగానే ఉండొచ్చు అయినా నా కోసం నవ్వుతూ ఉండు" అన్నాడు శంకర్రావు

"మీ చెల్లాయ్ లా నాకు ఊరంతా వినిపించేలా, ఒడలన్నీ కదిలి పోయేలా. వొంటి మీద గుడ్డ జారి పోతున్నా పట్టించు కోనంతగా ఇరగబడి నవ్వటం చేత కాదు లేండి. ఏమిటో. ప్రతి చిన్న దానికి అదేదో పెద్ద జోకయినట్టు నవ్వుతుంది. అక్కడికీ లోకంలో ఉన్న ఆనందాన్నంతా తానొక్కత్తే అందరికి పంచేస్తున్నట్టూ. అంతంత మాత్రంగా ఉన్న సంసారంగానీ లేక పోతే ఇంకెంత ఇరగ బడి పోతుందో" మూతి మూడు వంకరలు తిప్పేసుకుంటూ అంది అనసూయ.

ఇంక భార్యకి నచ్చ చెప్పే పని మానేసి కారు డ్రైవ్ చేస్తూ, అనసూయ ఇప్పటికీ మర్చిపోకుండా ఎత్తి పొడుస్తూ ఉండే మూడేళ్ల క్రితం జరిగిన సంగతి గుర్తు తెచ్చుకున్నాడు శంకర్రావు.

సరస్వతి శంకర్రావు సొంత చెల్లి కాక పోయినా" అంత కన్నా ఎక్కువ గానే మసులు కునే చిన్నాన్న కూతురు.

భర్త కాస్త లోక జ్ఞానం లేనివాడు కావటం మూలాన, ఆమే వ్యవహారాలన్నీ చూసుకుంటున్నా. ఏ మాత్రం బాధ వ్యక్త పరచకుండా. ఎప్పుడు నవ్వుతూ హుషారుగా 'ఈ ప్రపంచంలో ఇంత సంతోషంగా ఎవరూ ఉండరేమో' అనిపించేలా ఉంటుంది. ఏ చిన్న సందర్భం వచ్చినా నా అన్న వాళ్లందరిని పిలుస్తుంది. ఆప్యాయంగా అతిగా మర్యాదలూ చేస్తుంది. తనే స్వయంగా వండి వడ్డిస్తుంది. తినక పోతే అలుగు తుంది కూడా. కానీ అలక ఐదు నిమిషాల పాటుకూడా ఉండదు పలకరించగానే పసి పాప లాగా నవ్వేస్తుంది.

సరస్వతి చుట్టాలెవరింటికయినా వెళ్లినా సరే నాకెందుకు అనుకోకుండా తన పర బేధం లేకుండా అన్ని పనుల్లోనూ సాయం చేస్తుంది. మూడేళ్ల క్రితం తన కొడుకు పెళ్లికి పిలిచిందని వెళ్లారు.

పెళ్లి జరిగిన తర్వాత రోజు ప్రొద్దుటే తిరిగెళ్లాలని బయిలుదేరేటప్పుడు ఇంకా ఉండమని, కనీసం భోజనాలుచేసి వెళ్లమని బ్రతిమాలటమే కాకుండా వెళ్లనీకుండా అడ్డం పడి తన షర్టు పట్టుకుని వేలాడింది. ఇంకేముందు షర్టు జేబు చిరిగి చేతిలోకొచ్చింది. పోతే పోయో అనుకుందామంటే జేబులో ఉన్న ఐ ఫోన్, పది వేల రూపాయల కళ్ల జోడు కింద పడి పగిలి పోయాయి.

అనసూయకు ఉస్సూరుమనిపించింది. సరస్వతి వైపు గుర్రుగా చూస్తూ 'నీ భోజనం కాకులు తినా" అనిమనసులో తిట్టుకుంటూ ముందుకు నడిచింది.

"అయ్యో వదినా పుణ్యస్త్రీ పుణ్యం కనీసం రైకల గుడ్డా బొట్టైనా పెట్టనీ. ఆగొదినా." అంటూ సరస్వతి చెయ్యి చాపి అనసూయ జాకెట్ వెనుక వైపు మెడ దగ్గర పట్టుకుని ఆపింది, ఇంకేముంది. పర్రుమంటూ మెడ దగ్గర నుంచి నడుం వరకూ చిరిగి వేలాడ సాగింది

అనసూయకు బాధతో ఏడుపొచ్చినంత పనయింది. మోజు పడి మగ్గం వర్కు చేయించుకున్న ఉప్పాడ పట్టు జాకెట్, కుట్టించుకోవటానికే చీర ఖరీదు కంటే ఎక్కువే అయింది. అనసూయ అక్కడేం మాట్లడకుండా చటుక్కున కొంగు కప్పుకుని కారెక్కేసింది. అప్పుడే చెప్పింది తనతో 'ఇక ఈ మర్యాద రామన్న మనవరాలు లాంటి మీ చెల్లింటికి జన్మలో రాను' అని, కానీ ఇప్పుడు తను గట్టిగా చెప్పాడని తప్పక బైలుదేరింది. సరస్వతి గురించి ఆలోచించలలో ఉండగానే కారు ఊళ్లోకి వచ్చేసింది.

కారు సరస్వతి ఇంటి ముందు ఆపి లోనికెళ్లారు దంపతులు. అనసూయ మనసులోనే మొక్కేసుకుంటుంది 'ఆవిడ బాహు బంధాలకు చిక్క కుండా కాపాడు దేవుడా' అని, కానీ ఆమె అనుకున్నట్టు ఈ సారి అలాంటిదేం జరగ లేదు. సరస్వతి కొడుకు, కోడలు అతి సామాన్యంగా "వచ్చారా రండి" అంటూ ఆహ్వానించారు. శంకరరావు ఉండబట్టలేక " మా సరస్వతి ఏదమ్మా.?" అని అడిగాడు.

“ముందు అక్షింతలు వేయండి పెదనాన్నా. అత్తయ్య లోపలుంది. వెళుదురుగాని” అంది సరస్వతి కోడలు.

పాపకి అక్షింతలు వేసాక, సరస్వతి దగ్గరకెళ్లి ఆమె ఎదురుగా నిలబడ్డారు. ఆ దంపతులను చూడగానే ఆమె కళ్లలో చటుక్కున ఓ మెరుపు మెరిసి వెంటనే మాయమయింది.

"బావున్నారా. అన్నయ్యా, వదినా. రండి కూర్చోండి" అని అతి మామూలుగా. అంది, కానీ ఆమె ఆనందాన్ని బలవంతంగా అణిచి పెట్టు కుంటున్నట్లు తెలిసి పోతుంది.

ఆమె కళ్లలో ఏదో నిర్లిప్తత.. కానీ వచ్చిన బంధువులందరిని చూసి ఆమెలో కలిగే భావన మనసులోనే తొక్కి పెడుతున్నట్టు అనిపిస్తుంది.

దానికి కారణం ఆమె మనసుకి మాత్రం తెలుసు, కొడుకు పెళ్లి అయిన తరువాత, ఆమె ఇంట్లో మెల్లమెల్లగా కోడలి హవా మొదలైంది.

ఓసారి ఇంటికి వచ్చిన వారెవరినో 'టీ తాగి వెళ్ల' మని బ్రతిమాలే అత్తగారిపై సెటైర్ వేస్తున్నట్లు “మీరేమన్నా డొక్కా సీతమ్మ అనుకుంటున్నారా. ప్రతి వాళ్లనీ భోంచేసి వెళ్లమని టీ తాగి వెళ్లమని మర్యాదలు చెయ్యటానికి. ఇంట్లో పాలున్నాయో లేదోనని కూడా ఆలోచించరా!?” తెచ్చుకున్న సరుకులు నెల పూర్తి కాకుండానే అయిపోతున్నాయి. ఇంట్లో ఒక్క జాకెట్టు ముక్క కనపడనీయరు, మనదేమన్నా జమీందారీ దివాణమా. చుట్టాలెవరన్నా రావటం పాపం చీరాసారె అంటారు. ఈడ్చి కొడితే ఏడెకరాల పొలం మిగిల్చారు. అదన్నా ఉంచుతారా. మా మొహాలకి. ఇంట్లో రూపాయి మిగల్నీయరు" కోడలు ఇన్ డైరెక్ట్ గా అత్తగార్కి రెచ్చిపోవద్దంటూ వార్నింగ్ ఇస్తుంటే, కొడుకు తందానా అన్నాడు.

నిజానికి తను బంధువుల కోసమేం ఎకరాలు అమ్ముకో లేదు. తమ వాటాకొచ్చిన భూమంతా కొడుకుకి ముందే రాసేసింది. కాకపోతే తన భర్త అన్నదమ్ములు వాటాకొచ్చిన ఆస్థిని ఇంకాస్త పెంచుకొన్నారు. భర్త కలసి రాక తనక్కడే ఆగి పోయింది. ‘అయినా ఎవరైనా నాలుగు మెతుకులు తిన్నంత మాత్రాన పోయేదేముంది. అలా కలుపుగోలుగా ఉండక పోతే. కావల్సినప్పుడు ఆ నలుగురు ఉంటారా. బంధు బలగం లేని బ్రతుకు ఓ బ్రతుకేనా.' అనుకుంటుంది సరస్వతి.

కోడలి మాటలకి అభిమానవతి అయిన సరస్వతి, బంధువులపై ఉన్న తనలోని ఆపేక్ష, ఆప్యాయతలన్నీ మనసులోనే సమాధి చేసుకోవటం అలవాటు చేసుకుంది. విషయం ఎవరికి చెప్పుకో లేకపోయింది. అయినా కోడలు రాక ముందు అన్నీ సక్రమంగానే సరిపోయేవిగా. ఎగాదిగా మిగిలిపోయేవి కూడా. మరి ఇప్పుడెందుకు ఇంత కొరత. ఇది ఎంత ఆలోచించినా అర్థం కావట్లేదు సరస్వతికి.

ఫంక్షన్ అయిపోయింది. భోజనాల దగ్గర సరస్వతి ఎప్పటిలా హడావిడి చేస్తూ, వడ్డించే వార్ని అందరికి కొసరి కొసరి వడ్డించమంటూ. 'అది వేసుకోండి ఇది వేసుకోండి' అంటూ కలియ తిరుగక పోవటం బంధువులందరికి ఏదో లోటు గానే అనిపించింది. అనసూయ శంకర్రావులకు కూడా సరస్వతి మౌనం కాస్త బాధ కలిగించింది.

అనసూయ, శంకర్రావులు తిరుగు ప్రయాణమయ్యారు. సరస్వతి ఎప్పటిలా 'ఉండండి ఉండండి' అంటూ వెంట పడ లేదు. నవ్వు లోపించిన ముఖంతో ఏ హడావిడి, హంగామా చెయ్యకుండా సరస్వతి అతి మామూలుగా చెయ్యి ఊపింది. అనసూయ మనసు చిన్నబోయినట్టనిపించి, ఏదో.. వెలితిగా అనిపించింది.

ఈ కాలంలో అందరూ తనతో సహా ఇలాగే చుట్టాలతో అంటీ ముట్టనట్టుగా ఉంటున్నారు. ఫంక్షన్లకి పిలిచినా కానీ వచ్చిన వారు ఎప్పుడు వెళతారా. అని చూసే వాళ్లే ఎక్కువ. మునుపటి సరస్వతి లాగా.చుట్టాల రాక కోసం ఎదురు చూస్తూ, వచ్చిన వారిని ఉండమని తిని వెళ్లమనే వారు ఎవరున్నారు. అంత బంధు ప్రీతితో ఎవరుంటున్నారు. అసలు సరస్వతిలో ఈ మార్పేంటి.ఏమయింది తనకి' తాననుకున్నట్లు సరస్వతి తనను ఇదివరకటిలా అతిగా పట్టించుకోక పోయే సరికి, అనసూయకు ఏదో పెన్నిధిని పోగొట్టుకున్న ఫీలింగొచ్చి చటుక్కున వెను దిరిగి వెళ్లి సరస్వతిని గట్టిగా కౌగిలించుకుంది.

ఎప్పుడు చేయ్యి పట్టుకుంటే చాలు చటుక్కున విడిపించేసుకునే అనసూయ ఇప్పుడిలా చేరువయ్యే సరికి, సరస్వతి కళ్లలో వందో వెయ్యో మెరుపులు ఒక్కసారిగా వచ్చినట్టు మెరిసి పోవటంతో పాటు ఆనంద బాష్పాల తడి తళుక్కమనడం చూసిన అనసూయ సరస్వతి చేతిని తన చేతిలోకి తీసుకుని,

" సరస్వతీ. మాతో మా ఇంటికి రావా. ఓ నాలుగు రోజులుండి వద్దువు. మళ్లీ నీ ప్రేమని రుచి చూసి నా ప్రేమని నీకు పంచి, ఈ సారి నీవు వెళతానంటే ఆపి, నేను నీ జాకెట్టు పట్టకుని చింపేసి అతి'ధి' మర్యాదలంటే ఏంటో నీ స్టైల్లో చేసి నేనేంటో నీకు చూపెట్టాలని ఉంది." మనస్పూర్తిగా నవ్వుతూ అంటున్న అనసూయ మాటలకి సరస్వతి హాయిగా పగలబడి నవ్వుతుంటే. శంకర్రావుకి మునుపటి నవ్వుల సరస్వతి కనిపించి అతను కూడా ఆ నవ్వులకు కోరస్ పలికాడు.

★ ★ ★

COMMENTS